క్లుప్తంగా

22న మండల సమావేశం

సరుబుజ్జిలి: ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ పీవీ మురళీమోహన్‌కుమార్ గురువారం ప్రకటనలో వెల్లడించారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సరుబుజ్జిలి: రొట్టవలస ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ బయ్యన్నాయుడు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగిస్తామన్నారు. రొట్టవలస, పురుషోత్తపురం, అమాజీపేట, కొండవలస, పెద్దపాలెం, పాలవలస ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

రహదారులు నిర్మించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: మండలంలోని గొట్టిపల్లి, అడ్డంగి, లబ్బ, కారిగూడతోపాటు పలు గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఐటీడీఏ పీఓకు కొత్తూరు వైస్ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు సీతంపేటలో గురువారం వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా అబలాసింగి, డెప్పిగూడ, పెదరాజపురం, చినరాజపురంతోపాటు పలు గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం అంతంత మాత్రంగా ఉన్నందున అవస్థలు పడుతున్నారని వివరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొయిలాపు సంజీవరావు, రేగేటి కన్నయ్య స్వామి, అగతమూడి రంజిత్, పడాల వెంకటకృష్ణ, వడమ శ్రీనివాసరావు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



ప్రమాద స్థలంలో కారు, బైక్

మెళియాపుట్టి: మండలంలోని పరశురాంపురం పంచాయతీ పరిధిలో గల హీరాపురం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశాకు చెందిన ఓ పెట్రోల్ బంక్ మేనేజర్ పలాస నుంచి కారులో వస్తుండగా.. హీరాపురం గ్రామానికి చెందిన కవిటి జమ్మన్న ద్విచక్ర వాహనంపై పెద్దమడి నుంచి హీరాపురం గ్రామానికి వెళ్తున్నారు. హీరాపురం సమీపంలోని మలుపులో కారు, బైక్ ఢీకొనడంతో జమ్మన్నకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పలాసలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జమ్మన్న పెద్దమడి జూనియర్ కళాశాలలో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. దీనిపై పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి వెళ్లారు. ఫిర్యాదు రాకపోవడంతో కేసు నమోదు చేయలేదు.

తులసీవరప్రసాదరావు సేవలు గుర్తింపు



తులసీవరప్రసాదరావుకు అవార్డు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

కొత్తూరు: ది ఫారం ఫర్ బెటర్ శ్రీకాకుళం అందజేసిన ప్రతిష్టాత్మకమైన 2022–2023 యూనిక్ లీడర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు కొత్తూరు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు ఎంపికయ్యారు. అవార్డు, ప్రశంసా పత్రాన్ని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు జి.ప్రసాదరావు, దేవభూషణరావు తదితరులు గురువారం శ్రీకాకుళంలో అందజేసి సత్కరించారు. 20022–23 ఏడాదిలో సామాజిక సేవా రంగాల్లో తులసీవరప్రసాదరావు చేసిన కృషికి సంస్థ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. లయన్స్ క్లబ్ చైర్మన్ పృథ్వీ, కిరణ్, కన్నయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పరిశీలన

ఎల్.ఎన్.పేట: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని గృహ నిర్మాణశాఖ ఏఈ కె.రమేష్ అన్నారు. మండలంలోని మిరియాపల్లి గ్రామంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తి చేసుకున్న ఇళ్లకు బిల్లులు చెల్లించటం జరిగిందన్నారు. ఇళ్ల నిర్మాణ పనులు సెప్టెంబర్ నెలాఖారు నాటికి పూర్తిచేసి గృహ ప్రవేశాలు జరపాలని సూచించారు. దబ్బపాడు, తురకపేట గ్రామాల్లో పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు.



ఆమదాలవలస: ఆమదాలవలస మార్కెట్ యార్డు వద్ద ధ్రువపత్రాలు అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



సారవకోట: రామకృష్ణాపురంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

జగనన్న సురక్షతో..
సత్వర సేవలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరిస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న 11 సేవలను లబ్ధిదారులకు అందజేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించి లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పాతపట్నం: కాగువాడలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పొందూరు: తోలాపిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆమదాలవలస రూరల్: తోటాడలో ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



మెళియాపుట్టి: కరజాడలో ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డిశాంతి



జలుమూరు: యలమంచిలిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ గోపి, అధికారులు



హిరమండలం: హిరమండలం సచివాలయం-3లో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాసంక్షేమమే
సీఎం జగన్ ధ్యేయం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

● స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: రాష్ట్రంలో ప్రజాసంక్షేమంతోపాటు పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అర్హులకు అందజేస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డు టీ.జీ.ఆర్.కాలనీ, ఊసవానిపేట వార్డుల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేస్తూ, ఒక్కొక్క లబ్ధిదారునికి ఎంత మేరకు ఆర్థిక సహాయం అందిందో వివరించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్, వైఎస్సార్ సీపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, మాజీ కౌన్సిలర్లు దుంపల శ్యామలరావు, సాదు కామేశ్వరరావు, పార్టీ నాయకులు చెంచెల యర్రయ్య, సాదు చిరంజీవి, రవికాంత్, విజయ్, బొడ్డేపల్లి రవి కుమార్, స్థానిక నాయకుడు నున్నగాపుల చిన్నారావు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి..

ఆమదాలవలస: నిర్ణీత గడువులోగా జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని అధికారులకు స్పీకర్ తమ్మినేని సీతారాం ఆదేశించారు. ఆమదాలవలసలో స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి సంబంధించి నాలుగు మండలాలు, మున్సిపాలిటీలోని హౌసింగ్ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. గాజులకొల్లువలసలో 1,734 ఇళ్ల పట్టాలు మంజూరు చేశామన్నారు. వీటితో పాటు పొందూరు, బూర్జ, సరుబుజ్జిలిలో వేసిన లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు కట్టుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లిస్తుందన్నారు. సిమెంటు, ఐరన్ తదితర నిర్మాణ సామగ్రికి కూడా ప్రభుత్వమే అందజేస్తుందన్నారు. హౌసింగ్ పీడీ గణపతి, డీఈ అప్పారావు, ఏఈలు లక్ష్మీనారాయణ, సన్యాసిరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు సహకరించండి



పాతపట్నం: మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ వెంకట్రామన్



నరసన్నపేట: మాట్లాడుతున్న తహసీల్దార్ సింహాచలం

పాతపట్నం: ఈ నెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు జరగనున్న ఓటర్ల నమోదు, సవరణలు, తొలగింపులకు సంబంధించిన అంశాల్లో బీఎల్‌ఓలకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని జెడ్పీ సీఈవో రావాడ వెంకట్రామన్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో అవగాహన సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ బీఎల్‌ఓ తాను సేకరించిన దరఖాస్తుల వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు చూపించి, వారి సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్‌లు రవిచంద్ర, సరోజిని, చక్రవర్తి, బి.ప్రసాదరావు, ఎలక్షన్ డీటీ శైలజ, జనార్దనరావు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి, సలాన రాఘవులు, బి.నారాయణమూర్తి, రెడ్డి రామారావు, సవిరిగాన ప్రదీప్, పైల లక్ష్మయ్య, రాజారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటర్ల జాబితాలో చోటు కల్పించండి

నరసన్నపేట: జాతీయ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల నమోదు, జాబితా స్వచ్ఛీకరణలో భాగంగా అర్హులందరికీ ఓటర్ల జాబితాలో చోటు కల్పించాలని నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా ఓటర్ల జాబితాను బీఎల్‌ఓలు బాధ్యతగా పరిశీలించాలని కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో తహసీల్దార్ గురువారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ ఎ.సింహాచలం మాట్లాడుతూ అందరి అంగీకారంతోనే పేర్లు తొలగిస్తామన్నారు. గ్రామాల్లో బీఎల్‌ఓలకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించి ఇంటింటి సర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

దివ్యాంగ చిన్నారులను గుర్తించాలి

సరుబుజ్జిలి: దివ్యాంగ చిన్నారులను గుర్తించాలని సర్వశిక్ష అభియాన్ ఐఈఆర్టీ జిల్లా కో ఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు తెలిపారు. మండలంలోని పురుషోత్తపురం గ్రామ సచివాలయంలో గ్రామ వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌తో సీడబ్ల్యూఎస్ఎన్ సర్వేపై గురువారం అవగాహన కల్పించారు. ఇంటింటా సర్వే చేపట్టే సమయంలో దివ్యాంగ చిన్నారులను గుర్తించి, సమాచారాన్ని తమకు చేరవేయాలన్నారు. పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు ప్రశస్తా యాప్ డౌన్లోడ్ గురించి తెలియజేశారు. ఈ యాప్‌లో దివ్యాంగ చిన్నారుల వివరాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. స్పెషల్ ఎడ్యుకేషన్ అధ్యాపకుడు ఎండ రామకృష్ణ, సీఆర్పీ జి.రామినాయుడు, ఐఈఆర్టీ ఉపాధ్యాయురాలు అలేఖ్య, ఇన్‌స్ట్రక్టర్ నాగరత్నం పాల్గొన్నారు.



సర్వేపై అవగాహన కల్పిస్తున్న గోవిందరావు

చురుగ్గా భూముల రీ సర్వే

నరసన్నపేట: మండలంలో భూముల రీ సర్వే చురుగ్గా జరుగుతోంది. మండలంలోని చేనులవలస రెవెన్యూ గ్రామంలో గురువారం డ్రోన్ సర్వే నిర్వహించారు. డ్రోన్ పైలెట్ నవీన్, భాను, వీఆర్వో శ్యామ్, సర్వే అసిస్టెంట్ గణేష్ పాల్గొన్నారు.



చేనులవలసలో నిర్వహిస్తున్న డ్రోన్ సర్వే

కలమటకు అభివృద్ధి కనిపించదా?

కొత్తూరు: పాతపట్నం నియోజవర్గంలో సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి చేస్తున్న అభివృద్ధి.. టీడీపీ మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు కనిపించడం లేదా అని మండల పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ ప్రశ్నించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు మండలంలోని పారాపురం సమీపంలో గల ఏబీ రోడ్డులో చేపడుతున్న కల్వర్టు పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం దగ్గర ఉండి చేయించారు. పీఏసీఎస్ చైర్మన్ మాట్లాడుతూ గడిచిన రెండు రోజులు నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పారాపురం-కలిగాం కూడలి మధ్య ఉన్న కల్వర్టు పైనుంచి వరదనీరు ప్రవహించిన విషయంపై కలమట విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆర్‌అండ్‌బీ అధికారులు 2017లో పాడైన కల్వర్టును తొలగించి భారీ గొతిని తవ్వి వేదిలేశారన్నారు. అప్పట్లో కల్వర్టు నిర్మించకుండా.. ఎమ్మెల్యేను విమర్శించడం ఆయన దిగజారుడు రాజకీయానికి నిదర్శమన్నారు. కలమట ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆయన నివాసం ముందే హద్దుబంగి-పాలకొండ రోడ్డు పైనుంచి వరదనీరు ప్రవహిస్తే.. ఆ సమస్య పరిష్కరించలేదని.. నేడు తమ ఎమ్మెల్యేను విమర్శించడం భావ్యం కాదన్నారు. ఎమ్మెల్యే కృషితో కొత్తూరు మండలంలో ప్రధాన రహదారులైన కడుము నుంచి దిమిలి కూడలి వరకు (ఆంధ్రాకు చెందిన) రోడ్డు నిర్మాణం, మెట్టూరు నుంచి వసప వరకు రోడ్డు మరమ్మతులు, కురిగాం నుంచి పానుటూరు, రుగడ వరకు రోడ్డు నిర్మించామన్నారు. మెట్టూరు నుంచి కొత్తరు వరకు బీటీ రోడ్డు నిర్మాణంతోపాటు పలు గ్రామాలకు సీసీ రోడ్లు వేశామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బూర్లె శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, నక్క వెంకటరావు, లోతుగెడ్డ తిరుపతిరావు, పంకజదాస్, గండివలస ఆనందరావు, బోర ఆఫీస్‌రావు పాల్గొన్నారు.



పైపులు వేసే పనులు చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎరువుల పంపిణీ

బూర్జ: మండలంలోని తోటవాడ ఆర్బీకేలో సచివాలయ మండల కన్వీనర్ల కో ఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు ఆధ్వర్యంలో సబ్సిడీపై ఎరువులు, సిరి కందులు గురువారం పంపిణీ చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతులకు ఎరువులు అందజేయడం అభినందనీయమన్నారు. స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరు: గిరిజన ప్రాంతాల్లో రాగులు, కొర్రల సాగు విస్తీర్ణం పెంచేలా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కృషి చేయాలని స్థానిక ఏడీ రాజగోపాలరావు అన్నారు. స్థానిక ఏడీ కార్యాలయంలో గిరిజన రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఏఓ శ్రీనివాసరావు, ఏడీఏ బాబాజీ, ఎంటీ ఎస్.సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: మండలంలోని తురకపేట గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో రెండో విడత ఎరువుల పంపిణీ చేపట్టామని ఏఓ పైడి లతశ్రీ చెప్పారు. తురకపేట ఆర్బీకే వద్ద ఎరువుల పంపిణీని పరిశీలించారు. ఎంత ఎరువు కావాలన్నా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

సంక్షిప్తంగా..

డెంగీ, మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జలుమూరు: మలేరియా, డెంగీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి పి.వి.సత్యనారాయణ అన్నారు. జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా మలేరియా అధికారి మాట్లాడారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం, తలనొప్పి తదితర వ్యాధులు ఉంటే వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. మెడికల్ అధికారి టి.శ్రీకాంత్, ఏఎంఓ శ్రీనివాసరావు, చిన్నరాజులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ



సూచనలిస్తున్న గోవిందరావు

ఆమదాలవలస రూరల్: బడి బయట ఉన్న ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త బి.గోవిందరావు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో విద్యాశాఖ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ల సమన్వయంతో ఈ చిన్నారులను గుర్తించాలన్నారు. ఇంటింటా సర్వే చేపడితే ఈ గుర్తింపు సులభతరం అవుతుందన్నారు. ప్రత్యేక అవసరాల చిన్నారుల కోసం ప్రభుత్వం తగిన వసతులు కల్పించి, విద్యను అందజేయడం జరుగుతుందన్నారు. విద్యాశాఖ సిబ్బంది ఈ సర్వేను సక్రమంగా పూర్తిచేయాలన్నారు. ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, టింగరాజు, సహిత ఉపాధ్యాయులు పూజారి శ్రీధర్, ముత్యాలరావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

ఆమదాలవలస రూరల్: సైబర్ మోసాలపై బ్యాంకు ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని ఏపీజీవీబీ మేనేజర్ రమేష్‌బాబు అన్నారు. మండలంలో అక్కులపేట గామంలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్‌బీఐ ఆదేశాల మేరకు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ మోసాలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్ 1930, రిజర్వ్ బ్యాంక్ అంబుడ్స్‌మెన్ టోల్ ఫ్రీ నంబర్ 14448కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఖాతాదారులు ఏటీఎం వద్ద విత్ డ్రా చేసే సమయంలో, బ్యాంకుల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆర్థిక అక్షరాస్యత గ్రామాల్లో మెరుగుపడితే మోసాల బారినపడకుండా ఉండవచ్చునని తెలిపారు. సీఎఫ్ఎల్ సిబ్బంది రామారావు, చిగురుపల్లి వెంకటేష్, ఖాతాదారులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి



పాతపట్నం: తహసీల్దార్ కార్యాలయం ముందు దీక్ష చేస్తున్న వీఆర్‌ఏలు

ఎల్.ఎన్.పేట/సరుబుజ్జిలి/మెళియాపుట్టి/కొత్తూరు/పాతపట్నం/పొందూరు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, మెళియాపుట్టి, కొత్తూరు, పాతపట్నం, పొందూరు తహసీల్దార్ల కార్యాలయం వద్ద ఆయా మండలాల్లోని వీఆర్‌ఏలు గురువారం ధర్నా చేశారు. ఎన్నో సంవత్సరాలుగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస జీతం రూ.26వేలు ఇవ్వాలని, అర్హత కలిగిన వీఆర్‌ఏలకు వీఆర్వోలు, అటెండర్, డ్రైవర్ వంటి పోస్టుల్లో ఉద్యోగొన్నత కల్పించాలని కోరారు. నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.